షేర్లను ఒడిసిపట్టేద్దాం

ఐపీవో అలాట్‌మెంట్‌లో మీకున్న అవకాశాల్ని పెంచుకోండిలా

స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపట్ల ఆసక్తి ఉన్న మదుపరులకు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యతగల అంశమే. ఎందుకంటే ఈ ఆఫర్లు అనేకానేక ప్రయోజనాలను కలిగి ఉంటాయి. అయినప్పటికీ పెద్ద ఎత్తున డిమాండ్ కారణంగా ఈ పబ్లిక్ ఇష్యూల్లో షేర్లను దక్కించుకోలేకపోతుంటారు చాలామంది. అందుకే కొన్నిరకాల మార్గాల్లో ప్రయత్నిస్తే మదుపరులు తాముల అనుకున్నది సాధించవచ్చు.

ఇదీ సంగతి..

దేశీయ స్టాక్ మార్కెట్లు రోజుకో రికార్డు స్థాయిని తాకుతున్నాయి. ఒకప్పుడు స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్‌మెంట్‌పట్ల పెద్దగా ఆసక్తి చూపనివారే ఎక్కువ. కానీ ఇప్పుడు అంతా అమితాసక్తిని ప్రదర్శిస్తున్నారు. ఈక్విటీ పెట్టుబడులపై పెరిగిన అవగాహనే ఇందుకు కారణం. ఇక ఏదైనా సంస్థ ఐపీవోకు వచ్చినప్పుడు అందులో షేర్లను కొనాలనుకుంటే మీ కుటుంబ సభ్యులందరి పేర్లపైనా దరఖాస్తు చేసుకోవాలి. గడువులోగా ఈ పని పూర్తిచేయాలి. ఇతరత్రా విషయాలకొస్తే..

బహుళ డీమ్యాట్ అకౌంట్లతో

ఒకటికి మించి డీమ్యాట్ అకౌంట్ల ద్వారా పలుమార్లు దరఖాస్తు చేసుకోవడం వల్ల కూడా షేర్లను పొందవచ్చు. మీ కుటుంబ సభ్యుల పేరిట ఉన్న డీమ్యాట్ ఖాతాలను ఇందుకు వాడుకోండి. దీనివల్ల రష్ ఎక్కువగా ఉన్నప్పటికీ దేనికో ఒకదానికి మీ షేర్ల అలాట్‌మెంట్ జరుగుతుంది. అయితే దరఖాస్తు సమయంలో మీకున్న అన్ని డీమ్యాట్ ఖాతాల వివరాలను పేర్కొనడం తప్పనిసరి.

ఆఖరుదాకా ఆగవద్దు

ఐపీవో వచ్చినప్పుడు గంటల వ్యవధిలోనే రష్ పెరుగుతూ ఉంటుంది. కాబట్టి సమయం ఉన్నదికదా అని ఆఖరు గంటదాకా వేచిచూడవద్దు. చాలావరకు ఐపీవోలు 2 నుంచి 5 రోజుల వ్యవధితో పబ్లిక్ ఇష్యూలకు వస్తూంటాయి. తొలిరోజే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. రోజులు గడుస్తున్నకొద్దీ సర్వర్లు హ్యాంగైపోవచ్చు. దీనివల్ల మీ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

సాంకేతిక సమస్యలపై..

దరఖాస్తు ఫారాల్లో బ్యాంక్/డీమ్యాట్ ఖాతాలు, ఇతరత్రా వివరాలను తప్పుగా పేర్కొనవద్దు. ఒకటికి రెండుసార్లు పరిశీలించి సరైన వివరాలనే ఇవ్వాలి. లేదంటే మీ అప్లికేషన్లు తిరస్కరణకు గురవుతాయి. ఐపీవోల్లో చాలావరకు బిడ్లు ఇలానే పోతుంటాయి.

మాతృ సంస్థలకు మద్దతుగా

మాతృ సంస్థల్లో మీకు షేర్లున్నట్లైతే వాటి అనుబంధ కంపెనీలు ఐపీవోలకు వచ్చినప్పుడు తప్పక దరఖాస్తు చేసుకోండి. మీ విశ్వసనీయత, దీర్ఘకాలిక అంకితభావం కారణంగా షేర్ల కేటాయింపుల్లో మీకు తొలి ప్రాధాన్యత దక్కగలదు. ఉదాహరణకు ఆర్ఐఎల్‌లో మీకు షేర్లున్నట్లైతే ఆ సంస్థకు అనుబంధంగా ఉన్న రిలయన్స్ జియో, రిలయన్స్ ఫ్రెష్, రిలయన్స్ జ్యుయెల్లర్స్ సంస్థలు ఐపీవోలకు వస్తే వాటి కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు మీకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది.

చివరగా..

ప్రస్తుతం ఐపీవో మార్కెట్ సందడిగా ఉన్నది. అనేక రంగాల్లోని కంపెనీలు, స్టార్టప్‌లు నిధుల సమీకరణ కోసం పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. కాబట్టి ఈక్విటీ మార్కెట్లలో మదుపుపై ఆసక్తి ఉన్నవారు పెద్దపెద్ద సంస్థలను కాకుండా.. చిన్నచిన్న సంస్థలను ఎంచుకొంటే లాభదాయకం. నష్టాలు వాటిల్లినా పెద్దగా అవి మన పెట్టుబడులకున్న అవకాశాల్ని దెబ్బతీయవు.

గరిష్ఠ ధరకే బిడ్డింగ్

ఐపీవోల్లో షేర్ల ధరల శ్రేణిని గమనించే ఉంటారు. రూ.70-75, రూ.150-160, రూ.500-515 ఇలా రకరకాల బ్యాండ్లలో ఈ ధరలను ప్రకటిస్తారు. ఇందులో మీరు గరిష్ఠ ధరలకు బిడ్డింగ్ చేసినప్పుడే మీకు షేర్లను దక్కించుకోవడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. ఉదాహరణకు ఐపీవో ప్రైస్ బ్యాండ్ రూ.92-97 మధ్య ఉన్నది. అప్పుడు రూ.97కు షేర్లను కొంటామని మీరు బిడ్లను దాఖలు చేయాలి. తొలి ప్రాధాన్యతగా మిమ్మల్ని పరిగణిస్తారు.

ఒక్క లాట్‌కే దరఖాస్తు

ఐపీవోలో అలాట్‌మెంట్ దక్కాలంటే సింగిల్ లాట్‌కే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. అప్పుడే మీకున్న అవకాశాలు పెరుగుతాయి. సాధారణంగా చిన్న రిటైల్ మదుపరులను ప్రోత్సహించడానికి అలాట్‌మెంట్లలో వారికి తగిన ప్రాధాన్యాన్నిస్తారు. కనుక ఒక్క లాట్‌లోనే దరఖాస్తు చేసుకున్నవారికి ప్రయోజనం ఉంటుంది. ఒక్కో లాట్‌లో సాధారణంగా 100 షేర్లుంటాయి.

రాబడి

ఆర్థిక లక్ష్యాలకు అవరోధాలివే..

ప్రతీ ఒక్కరికీ వారివారి ఆర్థిక లక్ష్యాల సాధనకు నగదే ప్రధానం. కానీ ఆ నగదు పొదుపు విషయంలో అనేక అడ్డంకులు వస్తున్నాయి. అందుకే పట్టుదల, క్రమశిక్షణ, సరైన వ్యూహాలుండాలి. అప్పుడే ఫైనాన్షియల్ గోల్స్ సాకారం కాగలవు. అసలు ఆర్థిక లక్ష్యాల సాధనను ఏవి పక్కదారి పట్టిస్తున్నాయో చూస్తే..



క్రమశిక్షణారాహిత్యం

క్రమశిక్షణ లేకపోవడం వల్ల ఆర్థిక లక్ష్యాల సాధన జటిలంగా మారుతుంది. ఉదాహరణకు మార్కెట్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్ కనిపించిందని, ఇప్పుడున్న ఫోన్ బాగున్నా కొనేయడం అక్షరాలా దుబారానే. అలాగే అనవసరపు టూర్లతోనూ లేనిపోని ఖర్చే. ఇలాంటివన్నీ చాపకింద నీరులా మీ ఆర్థిక లక్ష్యాలను దెబ్బతీస్తాయని మరువద్దు.

ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకొని మన ఆదాయాలను పెంచుకుంటూపోవాలి. లేకపోతే మన సంపాదన, పొదుపును పెరిగే ధరలు మింగేస్తాయి. అది పిల్లల చదువుకయ్యే ఖర్చులు కావచ్చు లేదా మనం కొనాలనుకునే ఇల్లు కావచ్చు ఏదైనాసరే రోజులు గడుస్తున్న కొద్దీ మరింత ఎక్కువగా నగదును పెట్టాల్సి వస్తుందని మరువద్దు.

అత్యవసరాలు

జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేం. ముఖ్యంగా వైద్యవసరాలు ఎలా ఉంటాయో కూడా తెలియదు. అనుకోని ఆరోగ్య సమస్యలతో కూడా ఆర్థిక లక్ష్యాలు దెబ్బతింటాయి.

మార్కెట్ ఒడిదొడుకులు

మార్కెట్‌లో నెలకొనే ఒడిదొడుకులు కూడా ఆర్థిక లక్ష్యాలకు ఆటంకమే. పెట్టిన పెట్టుబడుల్లో రాబడులు తగ్గి అనుకున్న స్థాయిలో నగదు సమీకరణలు కష్టమవుతాయి. కాబట్టి మన చేతిలో లేనివాటికి మనం ఏమీ చేయలేం. ఉన్నవాటికైనా జాగ్రత్తతో ముందుకెళ్తే అనుకున్నది సాధిస్తాం.

మదుపర్లూ అప్రమత్తత అవసరం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు ఆల్‌టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకే పెద్దపీట వేస్తున్నారు. గత వారం ట్రేడింగ్‌లో శుక్రవారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,360, నిఫ్టీ 375 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీగానే ఎగిశాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,653.37 పాయింట్లు ఎగబాకి తొలిసారి 84వేల మార్కును దాటి ఆల్‌టైమ్ హై 84,544.31 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 434.45 పాయింట్లు ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 25,790.95 దగ్గర ముగిసింది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందంటూ మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉన్న విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 25,400 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 25,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 26వేల మార్కును నిఫ్టీ తాకవచ్చు. 26,100-26,400 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

ఇంటికీ బీమా రక్షణ



గృహమే కదా స్వర్గసీమ అన్నారు పెద్దలు. మరి ఆ ఇంటికీ రక్షణ ఉండాలి కదా. అందుకే ఇండ్లకూ ఇన్సూరెన్స్‌లొచ్చేశాయ్. గృహ బీమాను ప్రాపర్టీ ఇన్సూరెన్స్ లేదా హోమ్ ఓనర్ ఇన్సూరెన్స్‌గా కూడా పిలుస్తారు. ఎక్స్‌టీరియర్-ఇంటీరియర్ డ్యామేజీలకు కవరేజీనిస్తుంది. ఇంట్లోని వస్తుసామాగ్రీకి కూడా బీమా రక్షణ లభిస్తుంది. ఇంట్లో దురదృష్టవశాత్తూ జరిగే ఏదైనా ప్రమాదాలకూ వర్తిస్తుంది. హోమ్ ఇన్సూరెన్స్ సదుపాయాన్ని ఎస్బీఐ, శ్రీరామ్ జనరల్, బజాజ్ అలియాంజ్, భారతీ యాక్సా, రాయల్ సుందరం, రిలయన్స్, రహేజా క్యూబీఈ, ఓరియంటల్, న్యూ ఇండియా అష్యూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరాలీ, చోళమండలం వంటి సంస్థలు అందిస్తున్నాయి. ఇండ్ల యజమానులు, అద్దెకుండేవారు ఈ బీమాను తీసుకోవచ్చు. కొన్ని సంస్థలు హౌజింగ్ సొసైటీలకూ బీమాను కల్పిస్తున్నాయి. తీవ్రవాదుల దాడి, భూకంపాల్లో ధ్వంసమైనా బీమాను ఇస్తామని మరికొన్ని సంస్థలు ప్రకటిస్తున్నాయి.

కవరేజీ ఇలా..

షరతులు, ప్రీమియంలనుబట్టి ఆయా సంస్థలు.. అగ్ని ప్రమాదాలు, డాక్యుమెంట్ల నష్టం, దొంగతనాలు, గృహోపకరణాల డ్యామేజీ, వ్యక్తిగత ప్రమాద బీమా, అద్దె ఎగవేత, పెంపుడు జంతువుల సంరక్షణ, ఇల్లు పూర్తిగా దెబ్బతింటే ప్రత్యామ్నాయ వసతి ఖర్చులు, బ్యాగేజీ నష్టం, థర్డ్ పార్టీ-ఎంప్లాయ్ లయబిలిటీస్, ఎలక్ట్రికల్ ఫెయిల్యూర్ కవరేజీలను అందిస్తున్నాయి. ఇంట్లోని విలువైన ఎలక్ట్రిక్-ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫర్నీచర్, ఆభరణాలకూ బీమా కవరేజీ ఉంటుంది. ప్రకృతి విపత్తుల్లో ధ్వంసమైనా, అల్లర్లతో ప్రభావితమైనా ఇన్సూరెన్స్‌ను పొందవచ్చు. ఒకవేళ గృహ రుణం పరిధిలో ఇల్లు ఉన్నట్లైతే ప్రీమియంలు అధికంగా ఉంటాయి.

పాలసీ కాలపరిమితి

గృహ బీమా పాలసీలు దీర్ఘకాలానికిగాను కొనుక్కోవచ్చు. అలాగే కనిష్టంగా ఏడాది కాల పరిమితితో కూడా తీసుకోవచ్చు. ఇండిపెండెంట్ హౌజ్‌లు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లకు అనుగుణంగా ఈ పాలసీల కవరేజీని ఎంచుకోవచ్చు. నివాస ప్రాంతాన్నిబట్టి, పాలసీ వ్యవధి ఆధారంగా ప్రీమియంలుంటాయి. అయితే వాటిల్లిన నష్టానికి కారణం ఉద్దేశపూర్వక చర్యేనని తేలితే బీమా వర్తించదు.

'పుష్పక్' ప్రయాణికులకు 10% రాయితీ

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం ఎంతోమంది ప్రయాణికులు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు పుష్పక్ బస్సుల్లో వెళ్తుంటారు. వారి కోసం బస్సు టికెట్ ధరలో 10శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నట్టు టీజీఎస్ఆర్టీసీ ప్రకటించింది. ముగ్గురు లేదా అంతకన్నా ఎక్కువ మంది కలిసి గ్రూప్‌గా వెళ్తే.. వారికి అదనంగా మరో 10 శాతం కలిపి మొత్తం 20 శాతం డిస్కౌంట్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ ఆఫర్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు వర్తించనున్నట్టు తెలిపింది.

అయోధ్యలో పూజలకు శంకరాచార్య తిరస్కరణ

అయోధ్య: రామ జన్మభూమిలోని రామాలయంలో పూజలు చేసేందుకు ఉత్తరాఖండ్‌లోని జ్యోతిర్మఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి ఆదివారం తిరస్కరించారు. నిర్మాణం పూర్తి కాని దేవాలయంలో తాను పూజలు చేయనని చెప్పారు. అవిముక్తేశ్వరానంద ఆదివారం అయోధ్య నుంచి గో ధ్వజ స్థాపన భారత్ యాత్రను ప్రారంభించారు. అయోధ్యలోని సాధు, సంతులతో సమావేశమయ్యారు. గో రక్షణ కోసం చట్టాలను ఆమోదించాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో ఉగ్ర కలకలం

- సిటీలో 6 నెలలు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మకాం
- స్వాతంత్ర్య దినోత్సవాల్లో భారీ విధ్వంసానికి కుట్ర
- ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులకు చిక్కిన అబ్దుల్ రిజ్వాన్
- సైదాబాద్ శంకేశ్వర్‌బజార్‌లో ఎన్ఐఏ సోదాలు

ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించిన సైదాబాద్ శంకేశ్వర్‌బజార్‌లోని గ్రీన్ వ్యూ అపార్టుమెంట్.

హైదరాబాద్ సిటీబ్యూరో/సైదాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో తాజాగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోదాలు నిర్వహించడం కలకలాన్ని రేపింది. దేశంలో విధ్వంసాలకు కుట్ర పన్నిన కేసులో పట్టుబడిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అబ్దుల్ రిజ్వాన్ అలీని వెంటబెట్టుకుని ఆదివారం ఉదయం ముంబై నుంచి 3 వాహనాల్లో వచ్చిన ఎన్ఐఏ అధికారులు.. హైదరాబాద్ పోలీసుల సహకారంతో సైదాబాద్ శంకేశ్వర్‌బజార్‌లోని గ్రీన్‌వ్యూ అపార్టుమెంట్‌లో గంటకుపైగా తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాల తయారీలో నిష్ణాతుడైన రిజ్వాన్‌కు అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో సంబంధాలున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఐసిస్ తరపున పుణె నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న రిజ్వాన్ గతంలో కొంతకాలంపాటు సైదాబాద్‌లో ఉన్నట్టు ఎన్ఐఏ విచారణలో తేలడంతో అతని వివరాల కోసం గ్రీన్‌వ్యూ అపార్ట్‌మెంట్ యజమానితోపాటు ఆ చుట్టుపక్కల వారిని ఎన్ఐఏ అధికారులు ఆరా తీశారు. సైదాబాద్‌లోని కుర్మగూడ ప్రాంతానికి చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, ప్రస్తుతం పాకిస్థాన్‌లో తలదాచుకున్న ఫర్హతుల్లా ఘోరీతో రిజ్వాన్‌కు పరిచయం ఉన్నది. ఈ నేపథ్యంలో ఘోరీ ఈ ఏడాది మార్చిలో రిజ్వాన్‌ను హైదరాబాద్ పంపడంతో అతను సైదాబాద్‌లో కిరాయి ఇండ్లను వెతికాడు. శంకేశ్వర్‌బజార్‌లోని గ్రీన్‌వ్యూ అపార్టుమెంట్‌లో 'టూ-లెట్' బోర్డును చూసి ఆ ఫ్లాట్ యజమానిని సంప్రదించాడు. బట్టల వ్యాపారం చేస్తున్నానంటూ నమ్మించి రూ.4 వేలకు ఫ్లాట్‌ను కిరాయికి తీసుకున్నాడు. 6 నెలలపాటు అక్కడే ఉండి తరచూ కేరళ, ఉత్తరప్రదేశ్‌కు రాకపోకలు సాగించిన రిజ్వాన్.. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భారీ విధ్వంసం సృష్టించాలని ప్లాన్ చేశాడు. అందులో భాగంగా గత నెల మొదటి వారంలో హస్తినకు వెళ్లిన రిజ్వాన్‌ను ఢిల్లీ-ఫరీదాబాద్ సరిహద్దు ప్రాంతంలోని గంగాబక్ష్ వద్ద ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 30 బోర్ పిస్టల్, 3 కార్ట్‌రిడ్జ్‌లు, 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, రిజ్వాన్‌పై పుణెలో నమోదైన కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తున్నది. రిజ్వాన్‌పై రూ.3 లక్షల రివార్డు ప్రకటించిన ఎన్ఐఏ పీటీ వారెంట్‌పై అతడిని అరెస్టు చేసి విచారణ జరపడంతో గతంలో 6 నెలలపాటు హైదరాబాద్‌లో ఉన్నట్టు వెల్లడించాడు.

రిజ్వాన్ నేపథ్యం ఇదీ..

ఢిల్లీ పోలీసులకు చిక్కిన అబ్దుల్ రిజ్వాన్ 2015-16లో డిగ్రీ పూర్తి చేశాడు. ఆ సమయంలో ఐసిస్ వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు చూసి ఆకర్షితుడయ్యాడు. అనంతరం సొంత రాష్ట్రమైన జార్ఖండ్ నుంచి ఢిల్లీకి వచ్చి షహీన్‌బాగ్‌లో స్థిరపడిన రిజ్వాన్.. 2017లో అక్కడ షానవాజ్ అనే ఉగ్రవాదితో పరిచయం పెంచుకున్నాడు. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సేకరించడం, యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడంతోపాటు ఐసిస్ మాడ్యుల్‌ను యూపీ, ఉత్తరాఖండ్, జార్ఖండ్, మహారాష్ట్రకు విస్తరించడంలో కీలకపాత్ర పోషించాడు. నిరుడు జూన్‌లో పుణె పోలీసులు షానవాజ్ గ్యాంగ్‌లోని పలువురిని అరెస్ట్ చేసినప్పటికీ రిజ్వాన్ తప్పించుకున్నాడు. దీంతో రిజ్వాన్‌ను ఎన్ఐఏ మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదిగా గుర్తించి అతనిపై రూ.3 లక్షల రివార్డు ప్రకటించింది.

రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న కృష్ణయ్య, బీసీ నేతలు

బీసీ రిజర్వేషన్లు పెంచకుంటే యుద్ధమే

- మొక్కుబడిగా కులగణన చేస్తామంటే ఒప్పుకోం
- 42 శాతం పెంచాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
- రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం నేత ఆర్ కృష్ణయ్య
- తెలంగాణ చివరి ఓసీ సీఎం రేవంత్‌రెడ్డే: తీన్మార్ మల్లన్న

ఖైరతాబాద్, సెప్టెంబర్ 22 : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధం తప్పదని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని హోటల్ అశోకాలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడమే లేదని చెప్పారు. మొక్కుబడిగా కులగణన చేస్తామంటే ఒప్పుకునేది లేదని, 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేమెంతో మాకంత అన్న నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే అవుతారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర క్యాబినెట్‌లోనూ బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర నాయకులు లాల్‌కృష్ణ, వివిధ బీసీ సంఘాల నాయకులు వేముల వెంకటేశ్, గుజ్జ సత్యం, ఎర్ర సత్యనారాయణ, శ్రీనివాస్, జనార్దన్, జయంత్‌రావు, జగన్‌మోహన్, రామలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించండి

- జేఏసీతో కలిసి నిరసన కార్యచరణకు ప్రణాళిక
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా దశలవారీగా నిరసనలు
- గిరిజన గురుకుల ఉపాధ్యాయ సంఘం వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గిరిజన గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు కొన్ని రోజులుగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్లు పరిష్కారానికి దశలవారీగా నిరసన తెలుపాలని నిర్ణయించారు. అయితే గిరిజన గురుకుల ఉపాధ్యాయులు జేఏసీగా ఏర్పడి ఉమ్మడి సమస్యల పరిష్కారానికి సర్కారును డిమాండ్ చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం గురుకుల ఉపాధ్యాయులకు సంబంధించి రెండు జేఏసీలు ఏర్పడ్డాయి. అందులో ఒక జేఏసీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులను సంప్రదిస్తూ వినతి పత్రాలు అందజేస్తున్నది. మరో జేఏసీ ఒకటి రెండు రోజులలో తమ డిమాండ్ల సాధనకు సర్కారుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు ప్రకటించబోతున్నది. గిరిజన సంక్షేమ గురుకులాలతో పాటు అన్ని సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని గురుకులాల్లో పాత టైంటేబుల్‌ను అమలు చేయాలని, విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచాలని, 010 పద్దు కింద సొసైటీ టీచర్లకు జీతాలు చెల్లించాలని, కామన్ సర్వీసు రూల్స్‌ను అమలు చేయాలని, ఇలా అనేక సమస్యలు పరిష్కారానికి ఈ రెండు జేఏసీలు పోరాడుతున్నాయి.

వ్యాపారవేత్తకు 1.43 కోట్ల కుచ్చుటోపీ

మంచిర్యాలలో సైబర్ మోసం

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 22: మంచిర్యాలలో భారీ సైబర్ మోసం వెలుగుచూసింది. ఓ వ్యాపారవేత్తకు ఫోన్ చేసి బెదిరించి రూ.1.43 కోట్లు లూటీ చేసిన ఘటన ఆలస్యంగా బయటపడింది. ఆదివారం రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, సీఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన ఓ ప్రముఖ వ్యాపారవేత్తకు గత జూలై 22న గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 'హలో నేను ముంబై పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్న. మీపై మనీ లాండరింగ్ కేసు నమోదైంది. ఈ కేసు నుంచి బయటపడాలంటే మేం చెప్పిన ఖాతాకు డబ్బు పంపించాలి. మీ డబ్బును చెక్ చేసిన తర్వాత తిరిగి మీ అకౌంట్‌కు పంపిస్తాం. లేదంటే జైలుకు వెళ్లక తప్పదు' అంటూ బెదిరించడంతో బాధితుడు వణికిపోయాడు. భయంతో అతడు చెప్పిన విధంగా రూ.1,43,75,000 పలు దపాలుగా బదిలీ చేశాడు. డబ్బులు తిరిగి తన ఖాతాకు రాకపోవడంతో మోసపోయినట్టు గుర్తించాడు. అప్పట్లోనే 1930కి కాల్‌చేసి ఫిర్యాదు చేయగా సైబర్‌క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. బాధితుడు మనీ ట్రాన్స్‌ఫర్ చేసిన బ్యాంక్ అకౌంట్ మహారాష్ట్రలోని వాసిం జిల్లాకు చెందిన సంతోశ్ శ్రీకృష్ణ నాగల్కర్‌దిగా గుర్తించారు. మహారాష్ట్రకు వెళ్లి ముఠా సభ్యుడిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతని అకౌంట్‌కు వచ్చిన డబ్బులు మరో ఖాతాకు బదిలీ అయిన విషయం తెలుసుకున్నారు. తాను కమీషన్ మాత్రమే తీసుకుంటానని, డబ్బులు తీసుకునేది వారే వారని చెప్పాడు. అతడి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని, అసలు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. ఈ నిందితుడి ఖాతా ద్వారా ఇప్పటివరకు 18 సైబర్ నేరాలు జరిగినట్టు పోలీసులు గుర్తించారు.

ఆ సినిమా ఆడొద్దు ఎంఎన్ఎస్ హెచ్చరిక

ముంబై, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : పాకిస్థానీ నటుడు ఫవాద్ ఖాన్ చిత్రం 'లెజెండ్ ఆఫ్ మౌలా జాట్'ను మహారాష్ట్రలో విడుదల చేయరాదని మఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్‌ఠాకరే హెచ్చరించారు. పాకిస్థానీ నటుల చిత్రాలను భారతదేశంలో ఎందుకు విడుదల చేయడానికి అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. సకాలంలో చర్యలు తీసుకుని, ఈ సినిమా విడుదల కాకుండా చూడాలని ముఖ్యమంత్రి, హోం మంత్రి, డీజీపీలను కోరారు. కళకు సరిహద్దులు తెలియవని, అయితే, భారతదేశాన్ని ద్వేషించే దేశం ఏదైనా, ఆ దేశ చిత్రం మహారాష్ట్రలో విడుదల చేయకూడదని అన్నారు. థియేటర్ల యజమానులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఈ సినిమా విడుదలయ్యే సమయానికి నవరాత్రి ఉత్సవాలు మొదలవుతాయన్నారు.

- రామప్ప ఉపాలయంలో గుప్తనిధుల వేట